# తమరు తప్పుకొంటే పళ్ళీజలు బతికినట్టే!

ఆ పది గంటల రాత్రివేళగాని ఆ వీధి కొళాయిలో నీళ్ళు రావు. ఇంకానయం, కొళాయి రెండిళ్ళ అవతలే. ముందే రెండు బిందెలు అక్కడ ఉంచితే ఇబ్బంది ఉండదు. ఆ రాత్రి ఎప్పట్లా రెండో బిందెతో అరుగెక్కి, ఎవరో పిలిచినట్లై ఇటు తిరిగింది సీతమ్మ.

చంకని నీళ్ళ బిందెతో నిలబడి ఉన్నది ఆమె పిన్ని కూతురు పద్మ.

"అక్కడే నిలబడి పోయావేం. లోపలికి రా!"

"పంకజానికి పెళ్ళిటగా, ఇవాళే మాకు శుభలేఖ అందింది. మీరెలాగా వెడతారు కదా, మా అత్తగారికి వంట్లో బాగులేదు మేం రాలేం. వాళ్ళేం అనుకోకుండా కాస్త ఈ సంగతి గుర్తుంచుకుని చెబుతావని— వస్తా" అంటూ గబ గబా వెళ్ళిపోయింది.

నీళ్ళబిందె లోపలికి చేర్చడమే కష్టమైపోయింది సీతమ్మకి. గుండె భారమైపోయింది. గుక్కెడు మంచినీళ్ళు తాగి,గుమ్మాన్ని ఆనుకుని కూలబడిపోయింది.

రెండ్రోజుల క్రితమే ఒకరినోట ఈ మాట వింది. నమ్మబుద్ధి కాలేదు. ఇప్పుడు పద్మ స్పష్టంగా చెప్పనే చెప్పింది. ఆమె ఆడప్రాణం కొట్టుకుపోతోంది. శుభకార్యం జరుగుతున్నా తనకి పుట్టింటి తరఫున పిలుపే లేదు.

ఓవేళ శుభలేఖ పంపినా పోస్టులో మిస్ అయిందేమో! అయినా ఓ కడుపున పుట్టినవాడు. సొంత అన్నయ్య. తనకి ప్రత్యేకించి ఉత్తరం రాసి ఆహ్వానించనక్కర్లేదా? ఇన్నాళ్ళూ తనవాళ్ళని ఎంతో పొంగిపోయేది. ఉన్నట్టుండి తను పరాయిది అయిపోయిందా? ఏ నేరం చేసిందని తనకి

శిక్ష? కేవలం ఆడపిల్లల్నే కన్నందుకు అమ్మకికూడా అంత లోకువయి పోయిందా తను!

గుట్టుగా నేర్పుగా కుటుంబాన్ని తీర్చిదిద్దిన ధీమంతురాలు సీతమ్మ. పెద్దగా ప్రయోజకుడు కాని భర్తతో ఒకరిచేత వేలెత్తి చూపించుకోకుండా కాపరం చేసింది. ముగ్గురు ఆడపిల్లలకీ పెళ్ళిళ్ళుచేసి పంపింది. మరీ పెద్ద సంబంధాలు కాకపోవచ్చుగాని, అన్న వస్త్రాలకీ పిల్ల పాపలకీ లోటు లేకుండా వాళ్ళ బతుకేదో బతుకుతున్నారు. ఒంటరిగా మిగిలిపోయినా వృద్ధాప్యం మీదపడినా ఈనాటికీ ఆ దేవుడి దయవల్ల తనూ మొగుడూ తమ పనులు తామే చేసుకునే స్థితిలో ఉన్నారు. ఒకళ్ళ దగ్గిర చెయ్యి జాచకుండా అన్నానికీ బట్టకీ ఇబ్బంది లేకుండా వెళ్ళిపోతున్నాయి రోజులు మరి.

ఉన్నట్టుండి వచ్చి పడిన ఆ చిన్న సంఘటన సీతమ్మ నిండు తనాన్ని తొణికిసలాడించింది. లేనిపోని దైన్యం ఏదో పొరలా వచ్చి, మన సుని చుట్టుకుని వదలనని బెదిరిస్తోంది.

"బాగుంది. తనే ఇన్నాళ్ళూ కానుకుని ఉండకపోవచ్చు. వాళ్ళంతా భాగ్యవంతులు మరి. ఈ పెంకుటిళ్ళూ ఈ పట్టెమంచాలూ వాళ్ళ అంచనాకి హాస్యాస్పదంగా తోచి ఉండొచ్చు. ఆ వెయ్యేసి రూపాయల పట్టుచీరల రెపరెపల్లో ఈ జరీచీర కలవడం వాళ్ళకి చిన్నతనం అనిపించి ఉండ వచ్చు—"

"ఇదేమిటే ఈవేళప్పుడు ఇక్కడ కూచున్నావ్?" అని మొగు డొచ్చి పిలిస్తే ఉలిక్కిపడింది. అటు తిరిగి ఆ కన్నీటిచార అతని ముందు ప్రదర్శించడానికి ఆమె అభిమానం అడ్డొచ్చింది.

"నిన్నే, ఏం అలా చతికిలబడ్డావ్?"

సర్దుకుని జవాబు చెప్పడానికి సీతమ్మ కామాత్రం సమయం చాలు.

"ఏం లేదండీ, నీళ్ళు తెస్తూంటే కాలు జెణికింది. మిమ్మల్ని ఈ మాత్రం దానికి లేపడమెందుకని—"

"నీ మొహంలా ఉంది. మొగుడిచేత నీళ్ళు తెప్పించుకుందనుకుంటా రని గింజుకుంటావు గాని నీ ఆరోగ్యం చూసుకోవు. రేపట్నుంచి నువ్వు తెచ్చావో నా మీద ఒట్టే."

అని వెంకయ్య ఆ బిందె లోపల పెట్టి వచ్చి —

"ఇంకా అలా కూచున్నావేం?" అని, రెక్కపట్టుకు లేవదీశాడు! "వేలు ఎక్కడ మడత పడిందో చెప్పు. ఇంత అమృతాంజనం రాస్తాను" అని లోపలికి నడిపించుకు వెడుతూంటే ఆ తోడులోని చల్లదనానికి సీతమ్మ మనసు మురిసిపోయింది. ఇంతసేపూ అనుభవించిన వేదన అంతా సిగ్గుచే టనిపించింది. పుట్టింటివారిని సగర్వంగా నిలదీసింది.

"మీరు పిలిస్తే ఎంత, పిలవకపోతే ఎంత? దేవుడిలాంటి నా మొగుడి ముందు మీ భోగభాగ్యాలనగా ఎంత?" అయితే జరిగింది వేరు. ఆ నాలుగోరోజు తన పెద్దకూతురు సత్యవతి కొత్తవార్త మోసుకొచ్చింది, తిక్షాడు సామానుతోపాటు.

"ఇదేమిటే, కబురూ కార్డూ లేకుండా? ఎక్కణ్ణుంచి కొట్టుకొచ్చేవ్, ఈ వేళప్పుడు?" అన్నాడు గుమ్మంలోనే తండ్రి.

"ఇంకెక్కణ్ణుంచి, పెద్ద మామయ్య కూతురు పంకజం పెళ్ళికెళ్ళి వస్తున్నా."

తెల్లబోయి సీతమ్మవైపు చూశాడు వెంకయ్య. చూస్తూ కూతురితో అన్నాడు "అదేం విడ్డూరమే, మాకు కబురైనా లేదూ!" అంటూ తన ప్రశ్న తనకే వింతగా తోచి, "బావకి నేనన్నా మీ అక్కయ్య అన్నా ప్రాణం. ఎందుకు రాయడూ, రాసే ఉంటాడు. అబ్బబ్బబ్బ, ఈ దిక్కుమాలిన పోస్టల్ డిపార్ట్‌మెంటు ఉందే, ఇంతకన్న దౌర్భాగ్యులు దేశంలో ఉండరు. రాశాంకదా వస్తామని ఎదురుచూసి ఉంటారు గాని ఇలా అందలేదని తెలిస్తే స్వయంగా వచ్చి పిలుచుకు వెళ్ళరూ! బావలాంటి ఉత్తముణ్ణి తప్పుపడితే అన్నం మెతుకులు పుట్టవ్. పాపం ఒక్కడూ మరో పెద్ద సాయంలేక ఎంతగా కొట్టుకుపోయాడో! ఓ కుటుంబం లాంటి వాళ్ళం, నిజానికి నన్ను పిలవాలా? తెలిస్తే చాలు, రెక్కలు కట్టుకుని వాలి తలలో నాలికలా అన్నీ చక్కబెడుదును సుమా! పోన్లే .... మంచి సంబంధమేనా? కుర్రాడు బావున్నాడా? అందరూ వచ్చారా? పెళ్ళి బాగా జరిగిందా?"

సీతమ్మ నేర్పుగా విషయాన్ని దాటవేసింది.

"గుమ్మంలో నిలబెట్టి ఇంటికొచ్చిన ఆడపిల్లని అలాగేనా ప్రశ్నల వర్షం? పెళ్ళిలో నిద్రలేక అలసిపోయిందో ఏమో, బుచ్చెమ్మ ఎలా ఉందో

చూశారా? అసలే అది కాఫీ గత ప్రాణి. ఇంట్లో పాలచుక్కలు లేవు. దాని కసలే తలనొప్పి జబ్బు. ఎక్కడికెళ్ళి పాలు పుట్టించుకొస్తారో యేమో— ఇంటికొచ్చాక ఎన్ని కబుర్లైనా చెప్పుకోవచ్చు – వెళ్ళండి వెళ్ళండి" అని గిన్నె, డబ్బులు యిచ్చి మొగుణ్ణి తరిమింది. ఇంకో అయిదు నిమిషాలకి తల్లి యిచ్చిన కాఫీ ఊనబడుతూ–

"అమ్మా, నాన్న లాంటి అమాయకులు ప్రపంచంలో ఇంకెవరైనా ఉంటారుటే?" అని అడిగింది సత్యవతి తల్లిచేత జడ వేయించుకుంటూ.

"ఉండరమ్మా ఉండరు. అందుకే ఆయన్నీ నన్నూ అందరూ అంత లోకువ కట్టారు. మీ నాన్నలాంటి అమాయకులే కాదు, నీలాంటి నంగనాచులు కూడా లోకంలో అరుదే!" అని గట్టిగా జడను లాగింది.

"హబ్బ." అదేమిటే, "నేనేం చేశానే!"

"అక్కణ్ణుంచే వచ్చావు కదా, మామయ్య ఇచ్చిన పెళ్ళి బహుమతులు దండిగా అందుకుని ఏం మతిపోగొట్టుకుని వచ్చావో మరి! శుభలేఖ పంపించామనీ, ఉత్తరాలు కూడా రాశామనీ వాళ్ళ తరపున వకాల్తా పుచ్చుకుని వాదించడానికి ఇక్కడ దిగిఉంటావు."

తల్లి మాటకి అడ్డువచ్చి, జడ ఇటు వేసుకుని, ఎదురుగా తిరిగి అంది.

"నాన్నే అలా అంటున్నప్పుడు ఎందుకని ఊరుకున్నాను గాని నీతో చెప్పడానికే కదా, అమ్మమ్మ పంపితే నే నిక్కడికి వచ్చింది! ఇంతకీ మామయ్య కావాలనే యీ పెళ్ళి కబురు మీ దగ్గిర దాచాడని నాకు తెలీక పోతే కదా!" సత్యవతి కబురుతో సీతమ్మ సందేహం తీరిపోయింది. తెలిసే అన్నయ్య తమకి శుభలేఖ పంపలేదన్నమాట. దాన్తో ఆమె రెచ్చిపోయింది.

"తల్లిదండ్రుల్ని పిలవలేదని తెలిసి కూడా నువ్వా పెళ్ళి పందిట్లో ఉండగలిగావన్నమాట! కొడుకు ఈనాటికి ఆఫీసరు అయాడు కదా అని అమ్మకి కళ్ళు నెత్తిమీదకెక్కితే నేను ఆశ్చర్యపోను. నిన్న మొన్నటి దానివి, ఈనాటికి నీ మొగుడూ నాలుగు రాళ్ళు వెనకేసుకోడం చూసి నీకూ బుర్ర తిరగడం ఉందే, అదే నాకు ఆశ్చర్యం! తక్కువ సంపాదనా పరులని అవమానించి మాకు శుభలేఖ పంపడం మానుకున్నదే కాక,

పెళ్ళి ఎంత బాగా జరిగిందో చాటిరమ్మనీ, ఆ చేత్తో మా లేమిని ఎత్తి చూపించినట్టు ఉంటుందనీ సొంత కూతురి మీదకే మనమరాల్ని ఉసిగొలి పిందే, యింతటి ఆరింబా అయిందా యీ నాటికి మా అమ్మ!"

తల్లిని అలా అలసిపోయేదాకా వాగనిచ్చి ఆఖర్న అంది సత్యవతి.

"ఒంటి చేత్తో మమ్మల్నింతింత వాళ్ళని చేశావు. లోపల ఎంత శక్తి దాగి వున్నా పైకిమాత్రం ఎంతో డల్‌గా కనిపించి, చెప్పకేం, అప్పు డప్పుడు నిరాశగా ఉండేది నాలాంటి వాళ్ళకి, నిన్ను చూస్తే. ఇవాళ నీ స్పీచి వింటే మాత్రం అన్ని • అనుమానాలూ పటాపంచలైపోయాయ్ అమ్మా! అంతేకాదు....అమాయకత్వంలో నాన్నకంటే మరో రెండాకులు ఎక్కువ చదువుకున్నావు నువ్వు. మీ ఇద్దర్నీ ఇలా పోల్చుకుంటే నాస్తి కులకైనా దేవుడనే వాడున్నాడని నమ్మక తప్పదు!" అంటూ తల్లిని కౌగిలిం చుకుని చటుక్కున ముద్దెట్టుకుంది.

"ఆఖరికి మేమంత వెర్రివాళ్ళలా కనిపిస్తున్నాముటే! ఈనాటికి నీ కంటికి?" అంది సీతమ్మ కూతుర్ని విడిపించుకుంటూ.

"అందుకు అనుమానమా! అడుగో నాన్న వస్తున్నారు — ఆయన లేకుండా చూసి అసలు విషయం చెబుతాను. అన్నీ విన్నాక ఎవరు పిచ్చి వాళ్ళో నువ్వే చెబుదువుగాని—అందాక శివతాండవం ఆపమని నీ మన సుకి కాస్త నచ్చజెప్పు."

"ఏం నేర్చుకు పోయావే!" అని కూతురు రెండు బుగ్గలూ పుణి కింది సీతమ్మ.

ఆ మర్నాటి సాయంకాలం. తండ్రి పురాణానికి వెళ్ళాడని నిర్ధారణ అయాక సత్యవతి తల్లి దగ్గిర చేరి మొదలెట్టింది.

"ఇంత తెలివైన దానివయి ఉండీ, ఇన్నాళ్ళు నాన్నతో కాపురం వెలగబెట్టి కూడా ఆయన వెర్రిబాగులతనం ఇంకా నువ్వు పోల్చుకోక పోడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది. లేదా పుట్టింటివారి మీద పుట్టు కొచ్చిన పుట్టెడు కోపంతో నీ తెలివితేటలు తాత్కాలికంగా మరుగున పడ్డాయో—ఇన్నాళ్ళూ నాన్న అమాయకత్వం ఎలా ఉన్నా చిన్న చెల్లి పెళ్ళి అయిపోయి, ఉన్న ఒక్క బాధ్యతా తీరిపోవడంతో ఈ మధ్య మరీ చాదస్తం పెరిగిపోయి నట్లుంది. ఇదంతా నీకు చెప్పవలసిన అవసరం

రావడమే పెద్ద జోకు. అవును మరి, మా ఆడపడుచు రుక్మిణి పెళ్ళికి నువ్వు రాలేకపోయావు కదూ—అప్పుడు నాన్న చేసిన ఫార్సు ఎరగవు కదా—అమ్మమ్మా మామయ్యా ఆ పెళ్ళికి వచ్చారు మరి. బాగా నాటి పోయి ఉంటుంది వాళ్ళకి."

మరోసారి బుస్సుమనకుండా ఉండలేకపోయింది సీతమ్మ.

"ఏ మొచ్చిందే యివాళ నీకు. కన్న తండ్రిని వీధిలో పెట్టేంత దానివయ్యావ్? పుస్తెకట్టే వేళకి పేకాటలోంచి వెదికి పైకి లాగవలసిన పెళ్ళికొడుకులున్నారు. తెగతాగి పెళ్ళిపందిట్లో భరతనాట్యం చేసి నలుగుర్లో తలవంపులు తెచ్చే పెద్దమనుషులున్నారు. ఇంతెందుకు, అయిదుగురు కొడుకుల్ని కందిగాని అమ్మ, ఇంటికి ఒకే ఒక ఆడపడుచును నేను. ఇంటి మొత్తానికి అల్లుడు మీ నాన్న ఒక్కరే—ఏనాడైనా అల్లుడితనం చూపించారా, అలకపాన్పు ఎక్కారా. ఇది కావాలని అడిగారా? అదే అభ్యంతరం అయిపోయిందా? అందుకేనా ఆయన ఎక్కడ వస్తారో అని హడలిపోయి పెళ్ళికార్డు అయినా పంపడం మానుకున్నారు?"

సత్యవతి జవాబుగా ఫక్కుమని నవ్వింది. నవ్వుతూ అంది.

"నువ్వు ఒకే రకంగా ఆలోచిస్తే అదే రకంగా అనిపిస్తుంది. ఏం చెప్పను! దుర్మార్గమే ఉండనక్కర్లేదు, తగినంత లోకజ్ఞానం లేకపోవడం కూడా ఒక్కొక్కప్పుడు న్యూసెన్సుగా పరిణమించవచ్చు. నీ రెండో మనవడు లేడూ, ఎవడు, చిన వెంకట్రావుగాడు! నాన్న పేరు పెట్టుకున్నందుకు మువ్వూర్తులా ఆయన పోలికే వచ్చినట్టుంది నా కర్మకొద్దీ! మాకూ ఇంట్లో నుయ్యి ఉందిగాని, ఆ నీళ్ళతో పప్పు ఉడకదని వేరే ఓ బిందెడు పైపునీళ్ళు తెచ్చుకుంటాను. నేనిలా బిందె పట్టుకుని బయల్దేరేవేళకి ఎక్కడ చూస్తాడో, నేనూ వస్తానని వెంకుగాడు పేచీ. తీసుకెళ్ళకపోతే ఏడుపు. వాడూ నాలా చంకన ఏ కోలగిన్నో పట్టుకుని తయారు. అందులో ఏ సగం నీళ్ళో చాలంటే కోపం. నిండా ఉండాలి. నాలాగే చంకన పెట్టుకుని, నా వెనకే రావాలి. దార్లో గతుకులు. వేలెడు వెధవ ఏ రాయో తగిలి బోర్లాపడిపోయి భోరున ఏడుపు. నేనా బిందె కిందదించి వాడిని ఊరుకోబెడితే పోనీ అలా వస్తాడా, మళ్ళీ పైపుకి వెళ్ళి పూర్తిగా నింపవలసిందే. సగం నీళ్ళు ఒంటిమీద పోసుకుంటూ, పడుతూ లేస్తూ, ఇదిగో ఇదీ

నా కొడుకు నాకు చేసే సాయం. కుర్రాడు బుద్ధిమంతుడే. తల్లి కష్టపడుతూంటే చూళ్ళేక కేవలం మంచి బుద్ధితో బయల్దేరినవాడే. మంచిని భరించడం కూడా ఒక్కొక్కప్పుడు కష్టమే."

"విషయం తెలిసిందిలే, ఇక అట్టే సాగదియ్యక, రుక్మిణి పెళ్ళిలో మీ నాన్న చేసిన మహాపరాధం ఏమిటో వివరించు" అనే సీతమ్మ ప్రశ్నకి కూతురు చెప్పిన సంఘటన క్లుప్తంగా ఇదీ :

రుక్మిణి పెళ్ళివేళకి సీతమ్మ మూడోకూతురు పురిటికి వెళ్ళవలసి వచ్చింది. వెంకయ్య ఒక్కడే పెళ్ళికి హాజరయ్యాడు. అదివరకు ఎలా ఉన్నా ఓ ఏటికి ఓ ఏడు ఒంటిమీదికి వచ్చినకొద్దీ వెంకయ్య పంతం, పేచీ కొంచెం పెరుగుతూ వచ్చాయి. ఆ పెళ్ళిలో తనలాంటి పెద్దవాణ్ణి ఎవరూ కనుక్కోలేదని అలకకాదు. తన పెద్దరికం గుర్తించి, తనకెవరూ ఏ పనీ అప్పజెప్పరని కినుక. తీరా అప్పజెబితే ఒకరు చెప్పినట్టుగాక 'ఇంత పెద్ద వాణ్ణి, నేను అనుకున్నది కరెక్టు కాకపోతుందా' అనే పొడుం పట్టంత అహంకారం. రుక్మిణికి కుదిరిన సంబంధం బొత్తిగా ఆచారపరులు. తక్కిన ఏదైనా గడుపుకుంటారు గాని వంటమాత్రం శ్రీవైష్ణవుడిచేత తప్ప, నోట పెట్టరు. అతికష్టంమీద ఆ ప్రాంతాలలో ఒకే ఒక వంట స్వామిని కుదిర్చారు. మిఠాయి ఉండలు చేస్తున్నవేళ అతనికి కాస్త దూరంగా, కుర్చీ వేసి వెంకయ్యగారిని కూచోపెట్టేరు. 'వాడో పోకిరీ మనిషి సుమండీ, వాడేం చేసినా చూసీ చూడనట్లు ఊరుకోండీ. మరొకడు దొరక్క అన్నిటికీ సిద్ధపడే వాణ్ణి కుదిర్చాం. ఎవరూ లేకపోతే మరీ పెట్రేగిపోతాడని మిమ్మల్ని కూచోబెట్టాం గాని మీ పని కేవలం విశ్రాంతి తీసుకోడమే' అని ముందుగా స్పష్టంగా హెచ్చరించి మరీ ఆయనకా పని అప్పచెప్పేరు. కాని ఆయన అమాయకత్వం ఆయన్ని ఊరికే కూచోనివ్వలేదు. ఎవరేం చెప్పినా వింటాడుగాని తనకి తోచిన పద్ధతిలోనే అర్థంచేసుకునే స్టేజికి ఆయనెప్పుడో ఎదిగిపోయాడు! 'ఏదో పెద్దవాడూ, బాగుండదని విశ్రాంతి తీసుకోమన్నారు గాని ఇంకా కాళ్ళూ చేతులూ పనిచేస్తూనే ఉన్నాయ్, నా ముందు ఇంతింత కుర్రాళ్ళు ఒళ్ళు హూనం చేసుకుంటూంటే పోతులా తింటూ ఊరికే కూచోడానికి నేనేం, పైవాణ్ణా!' అని వంటస్వామి మీద పర్యవేక్షణకి సిద్ధమై పోయాడు. ఆ వంటస్వామి పాకశాస్త్రంలో

పట్టభద్రుడే కాక, కామశాస్త్రంలో గౌరవ కళాప్రపూర్ణ కూడా. అల్లంత దూరంలో ఒళ్ళంతా కదుపుకుని అంట్లుతోముతున్న పడుచు అప్పలమ్మల్ని చూసి అతనెలా ఊరుకోగలడు? ఓసారి అటూ ఇటూ చూసి, పూలబంతుల లాంటి మిఠాయి ఉండలు పడుచు గుండెల పెదాలకందేలా విసిరి అందిం చడం ప్రారంభించాడు. వెంకయ్య ఇది చూసి ఊరుకోగలడా! రెడ్ హాండెడ్‌గా పట్టేశాడు. నలుగురిలో నిలబెట్టేశాడు. దొంగతనం, రంకు తనం మిళాయించిన వీడేం ఆచారి, పొమ్మన్నాడు. అంతమాట పడతాడా స్వామి? బతిమాలినకొద్దీ రెచ్చిపోయాడు. పేట్రేగిపోయాడు. ఎవడైతేనేం, కులం నమ్మిన వాళ్ళకి గుణంతో పనేమిటి, చక్రాంకితం లేని చేత్తో చేస్తేయేం ముద్ద ఎత్తం పొమ్మన్నారు, మొగపెళ్ళివారు! అలిగి సగం దూరం పారి పోయిన స్వామిని రెట్టింపు యిచ్చి ఇటువైపు మళ్ళించేసరికి తాతలు దిగొ చ్చారు!

"ముందే నీకు చెప్పాం కదా, ఎందుకలా చేశావ్?" అని మామయ్య నాన్నని నిలదీస్తే 'బాగుంది బావా, కుర్రాళ్ళు చెప్పారుకదా అని అంత ఘోరం కళ్ళెదురుగుండా జరుగుతూంటే అన్నీ తెలిసినవాణ్ణి, చూస్తూ ఊరుకోమన్నావా? నా ప్రాణం పోతేపోనీ, నే ఊరుకోలేను సుమా!' అని ఆ పెళ్ళి ఆగిపోయినా సరే, తనదే రైటని నాన్న వాదన.

ఆ సంఘటన పూర్తిచేస్తూ సత్యవతి అన్నదిదీ :

"నాన్నది అమాయకత్వమే, కాదనను. తన దృష్టిలో అది మంచిదే కావచ్చు. కాని ఎదుటివారికి ఇబ్బంది కల్పించినప్పుడు, లోకజ్ఞానం లోపించినప్పుడు, అది కేవలం మూర్ఖత్వం కిందే వస్తుంది. అనాలోచి తంగా ఆడిన చిన్నమాటవల్ల పెద్దపెద్ద పీటలమీద పెళ్ళిళ్ళు తప్పిపోయిన ఉదంతాలున్నాయి. పోనీ అంత గొడవ జరిగాక కూడా తన జోక్యం తప్పని నాన్న తెలుసుకోడే! దాంతో మామయ్య బెదిరిపోయాడు. ఇప్పుడు పంకజం పెళ్ళివారు కూడా బొత్తిగా పేచీమనుషులు. కట్నాలు లాంఛ నాలూ మాట్లాడుకోడానికి వెళ్ళినప్పుడే ఆ సంగతి మామయ్యకి తెలిసిందిట. వరుడు అందగాడూ, బ్యాంకు ఆఫీసరూ. అందుకని సిద్ధపడ్డాడు గాని పుస్తిముడుపు అయ్యేదాకా అత్తా మామయ్యా ఇలా గుండెలు పట్టుకుని గడుపుకొచ్చారు. అమ్మమ్మే అంది 'నాకు ఒక్క కూతురు. అది ఈ

పెళ్ళికి రాకపోతే నా మనసు బావురుమని ఏడుస్తుంది. మాకూ మాకూ ఏం విరోధాలు వచ్చాయో అని పెళ్ళికొచ్చిన వాళ్ళంతా నిలదీస్తే జవాబు చెప్పుకోలేక చావాలి. కాని ఏం చెయ్యను! వయసు మీదపడ్డకొద్దీ అల్లుడు చంటిపిల్లాడు అయిపోతున్నాడు. తీరా వచ్చాక చెప్పినట్లు విని ఓ చోట కూచోడు. ఏం దారి భగవంతుడా!' అని కొట్టుకుంది. ఆఖరికి మిమ్మల్ని పిలవకూడదనే నిశ్చయించారు.

'ఇన్నాళ్ళకి కూతురికి శుభమూ అని పెళ్ళి చేస్తున్నాను. తోడబుట్టిన దాన్ని ఇంటికి పిలిపించి, ఇంత పసుపూ కుంకుమా ఇచ్చుకోలేని దుస్థితిలో పడ్డాను! ఇలాంటివి ఉన్నాయని ఒకరికి చెప్పినా నమ్మరు. సీత ముందు రేపొద్దున్న ఎలా తలెత్తుకోగలనో నాకే తెలీడంలేదు' అని బాధ పడిపోయాడు మామయ్య. చిన్నప్పుడు వాళ్ళింట్లో కొన్నాళ్ళుండి చదువు కున్నాను గనక నేనంటే చనువు. నాతో అన్నీ చెప్పారు. ఇలా మిమ్మల్ని పిలవని సంగతి మా నలుగురికీ తప్ప మరొకరికి తెలీదు.

'రెండు ఉత్తరాలు రాశాం. శుభలేఖ పంపాం. వైరిచ్చాం. ఆఖరికి ఫోన్ చేశాం కూడా....సీతా మొగుడూ ఎందుకు రాలేదు మరి' అని దగ్గర వాళ్ళందరి దగ్గిర దబాయించి పారేశాడు మామయ్య. నాతో మాత్రం అన్నాడు.'

'నా నాలిక కోసినా మీ అమ్మతో అబద్ధం ఆడలేను. రాష్ట్రాన్ని ఉద్ధరిస్తామని ఇల్లు నింపుకునే దేశద్రోహులైన మంత్రులైతే వాళ్ళు తప్పు కుంటేనే శ్రీరామరక్ష. కాని పసిపాపలాంటి బావలో మచ్చుకైనా దుర్మార్గం లేదే! ఏంచెయ్యను....ఈ పనులవీ పూర్తై ఎప్పుడు సీతని కలుసుకుని క్షమా పణ చెప్పుకుంటానో...ఈలోగా ఈ కబురు తెలిసి ఏం అపార్థం చేసుకుం టుందో.'

"అంత బాధ్యతా నా నెత్తిన వేసుకు వచ్చానే అమ్మా ...జరిగింది చెప్పాను. నిన్న నా జడపట్టుకుని కోపంగా కిందకి లాగావు చూశావా! ఇప్పటికి నొప్పి వదల్లేదు. ఇంకా ముందు ఏమేం బహూకరిస్తావో నాకు" అంటూ కిలకిల నవ్వింది.

"బహుమతులంటే గుర్తొచ్చింది. పెద్ద మామయ్య నీకూ నాన్నకీ

బట్టలు పంపేడు. అమ్మమ్మ మిఠాయీ మినపసున్నీ అటుకులూ అతి సెలూఇచ్చింది. నువ్వు ఇష్టపడితేనే పెట్టి తాళం తీస్తాను సుమా!"

సీతమ్మ మురిపెంగా కూతురివైపు చూసింది.

నిన్న మొన్నటి బుచ్చెమ్మ. జుత్తు నిండా మన్నుపోసుకుని పిచ్చి దాన్లా కళ్ళెదురుగా ఇంకా తిరుగుతున్నట్టే ఉంది ఎంతట్లో సక్కలాంటిది నాయకురాలుగా మారిపోయింది!

ఇలా పెట్టి తాళం తీశారో లేదో, ఎక్కణ్ణుంచి చూశాడో, వెంకయ్య గాలి వానలా వచ్చిపడ్డాడు.

"ఇంకా వెనకపడే ఉన్నారు వెర్రి మొహాలు! పద్మావాళ్ళకీ శుభలేఖ అప్పుడే అందించిందట. చెబితే వెళ్ళి ఓ చెయ్యి సాయంచేసి ఉండనూ! అయినా పరాయివాళ్ళమా, మనకా శుభలేఖ మానేది! అందకపోతే మాత్రం కనుక్కుని వెళ్ళాలా, అక్కర్లేదా? మనం రాలేదని కోపం లేకపోగా బట్టలు కూడా పంపించాడు చూడు మీ అన్నయ్య! అదముండలకి ఇలాంటివి ఏం అర్థమయి చస్తాయి!"

అంటూ మిఠాయీ మినపసున్నీ కలిపి గుబుక్కు గుబుక్కున బొక్కుతున్న వెంకయ్యని చూసి నవ్వు ఆపుకోలేక పోయారు ఆ తల్లీ కూతుళ్ళు!